క్లుప్తంగా

బాలుర గృహానికి వితరణ


బాలుర గృహంలో అధికారులకు ఆసరా చారిటబుల్ సొసైటీ అందించిన వస్తువులు

ఆరిలోవ: దీనదయాల్‌పురంలోని ప్రభుత్వ బాలుర గృహానికి ఆసరా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు మంగళవారం సుమారు రూ.45 వేలు విలువ చేసే సామగ్రి అందజేశారు. రిఫ్రిజిరేటర్, వెట్ గ్రైండర్, ఇడ్లీ పాత్ర తదితర వస్తువులను గృహం అధికారులకు అందించారు. ఈ సందర్భంగా గృహం సూపరింటెండెంట్ వీరయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు సీహెచ్.సునీత, బి.శ్రీనాథ్, గృహం సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ నాయకుల నిరసన


ఏఐవైఎఫ్ నాయకులతో మాట్లాడుతున్న పోలీసు అధికారి

మద్దిలపాలెం: కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల జులుంను నిరసిస్తూ మంగళవారం ఏఐవైఎఫ్ నాయకులు ఆందోళన చేశారు. బంద్ చేయాలని ఏఐవైఎఫ్ నాయకులు పలు పాఠశాలల వద్దకు వెళ్లి డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు వారి వారించడానికి ప్రయత్నించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు పడాల గోవింద్, మధురెడ్డి, కెల్ల రమణ, రావి అశోక్, బాలు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

మర్రిపాలెం: తాటిచెట్లపాలెం జాతీయ రహదారిపై విశాఖ డెయిరీ పాల లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలిలా.. సోమవారం రాత్రి సుమారు 10.30 గంటల ప్రాంతంలో ఎన్ఏడీ నుంచి మద్దిలపాలెం వైపు వెళ్తున్న విశాఖ డెయిరీ పాలలారీ తాటిచెట్లపాలెం జాతీయ రహదారి వద్ద సుమారు 30–40 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో మంగళవారం కంచరపాలెం వీఆర్వో బాబూలాల్ ఫిర్యాదు మేరకు ఐదవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఎన్. సాయి నేతృత్వంలో ఎస్ఐ సమీర్ కేసు దర్యాప్తు చేపట్టారు. సదరు మృతుడు 5 అడగుల పొడవు, నలుపు రంగులో ఉన్నారని, అతని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరచామని, ఆచూకీ తెలసిన వారు కంచరపాలెం పోలీసులను సంప్రదించాలన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలతోనే దేశాభివృద్ధి


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటూ పోవడం సరికాదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 894వ రోజు మంగళవారం, సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను 100 శాతం అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. ప్రైవేటీకరణతో కార్మికులకు నష్టం కలుగుతుందన్నారు. కార్మికులను విస్మరించిన ఏ ప్రభుత్వం బాగుపడలేదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని స్పష్టమైన ప్రకటను చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


పెదగదిలి కూడలిలో చేరిన బురదనీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహనచోదకులు


పెదగదిలి గెడ్డపై బ్రిడ్జి మీద చేరిన వర్షపు నీరు

తెరిపివ్వని వరుణుడు


శివాజీపాలెం ప్రధాన రహదారిలో నిలిచిపోయిన వర్షపు నీరు

ఆరిలోవ: నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తూర్పు నియోజకవర్గంలో రహదారులు జలమయమయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి కాలువలు నిండిపోయి పొంగిపొర్లాయి. వరద నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. నీరు తగ్గిన తర్వాత రోడ్లు బురదమయమయ్యాయి. హనుమంతవాక కూడలి వద్ద ఎల్వీపీ కంటి ఆస్పత్రి వైపు రోడ్డుపై నీరు నిలిచిపోయింది. ఈ కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్ పడినప్పుడు వాహనచోదకులు ఆ నీటిలోనే వాహనాలు నిలిపి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. పెదగదిలి కూడలిలో కొండవాలు నుంచి వచ్చిన వరద నీరు ఇక్కడ నిలిచిపోతోంది. ఆ బురద నీటిలో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారు. పెదగదిలి, తోటగరువు మధ్య గెడ్డపై ఉన్న బ్రిడ్జిపై కూడా వర్షపు నీరు నిలిచిపోయింది.

మద్దిలపాలెం : భారీ వర్షాలకు రహదారులు, కాలువలు జలమయమయ్యాయి. శివాజీపాలెం ప్రధాన రహదారిపై రెండు అడుగుల మేర నీరు ప్రవహించడంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. మ్యాన్‌హోల్స్ నుంచి వర్షపు నీరు పొంగిపొర్లుతోంది. మద్దిలపాలెం, కేఆర్ఎం కాలనీ, ఇసుకతోటలో పలు ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోయాయి.


పెదవాల్తేరులో కూలిన వేపచెట్టు

పెదవాల్తేరులో కూలిన వృక్షం

ఏయూ క్యాంపస్: స్థానిక పెదవాల్తేరులోని అమ్మవారి గుడి చేరువలో ఉన్న వేపచెట్టు మంగళవారం కూలిపోయింది. చాలా కాలంగా ఉన్న ఈ వేపచెట్టు వేర్లతో సహా కూలింది. చుట్టూ నిర్మాణాలు పెరిగిపోవడం, ఈ క్రమంలో చెట్టువేర్లు కొట్టివేయడంతో వర్షానికి నానిపోయి చెట్టు కూలినట్లు స్థానికులు చెబుతున్నారు. అమ్మవారి గుడి దగ్గర ఉండే ఈ చెట్టును రక్షించే చర్యలు చేపట్టకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

హుద్‌హుద్ ఇళ్లకు విద్యుత్ సదుపాయం కల్పించాలి

ఎంవీపీ కాలనీ: హుద్‌హుద్ ఇళ్లకు విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరుతూ ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని హౌసింగ్ కార్పొరేషన్ జిల్లా కార్యాలయం ఎదుట మంగళవారం ఉదయం ఆయా నివాసితులు నిరసనకు దిగారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి.వెంకటరావు మాట్లాడుతూ గతంలో హుద్‌హుద్ తుపాను కారణంగా నష్టపోయిన వారికి కొమ్మాదిలో హౌసింగ్ కార్పొరేషన్ ఇల్లు కేటాయించిందన్నారు. అయితే ఆ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతుందన్నారు. దీనిపై కొంత కాలంగా లబ్ధిదారులు హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యుత్ సరఫరా లేని కారణంగా ఆయా ఇళ్లలో అంధకారంతో పాటు నీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించి విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరారు. దీనిపై కార్పొరేషన్ పీడీ స్పందిస్తూ త్వరలోనే విద్యుత్ కనెక్షన్లు ఇస్తామని హామీ ఇచ్చినట్లు వెంకటరావు తెలిపారు.


హౌసింగ్ కార్పొరేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న హుద్‌హుద్ ఇళ్ల నివాసితులు

రేపటి నుంచి శ్రీవారి శ్రావణ మాసోత్సవ సప్తాహం


మాట్లాడుతున్న హిమాంశుప్రసాద్, తదితరులు

ఎంవీపీ కాలనీ: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో వైదిక ధర్మ ప్రకారం గురువారం నుంచి శ్రీవారి శ్రావణ మాసోత్సవ సప్తాహం వైభవంగా నిర్వహించనున్నట్టు విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన వివంచి సంస్థల ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ మాట్లాడారు. ఈ ఈ కార్యక్రమం వచ్చేనెల 2వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ప్రతి రోజు రాత్రి వరకు శ్రీవేంకటేశ్వరస్వామికి విశేష పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. 27న తిరుప్పావడ సేవ, 28న శ్రీవారికి అభిషేకం, కుంకుమార్చన, 29న అర్చన, స్వామివారి కల్యాణం, 30, 31న విశేష పూజ, ఆగస్ట్ 1న శ్రీరామచంద్రమూర్తికి అభిషేకం, 2న అష్టోత్తర కలశాభిషేకం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో నగర వాసులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

మలేరియా, డెంగ్యూ కట్టడికి ఇంటింటి సర్వే

మద్దిలపాలెం : మలేరియా, డెంగ్యూ కట్టడికి పక్కాగా చర్యలు చేపడుతున్నామని జిల్లా మలేరియా విభాగం సబ్ యూనిట్ అధికారి నగేష్ పటాన్నాయక్ తెలిపారు. ఈ మేరకు మద్దిలపాలెంలో మంగళవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ డెంగ్యూ కేసులు నమోదు అవుతున్న తరుణంలో ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు తొలగించడం, జ్వర పీడితులుంటే వారి నుంచి రక్త పూతల సేకరణ ప్రక్రియ చేపడుతున్నామన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు తొలగింపు చర్యలు చేపట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నిర్మూలనలో జీవీఎంసీ మలేరియా సిబ్బంది, సచివాలయాల ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు ప్రజల సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కుమార్, రత్నం, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.


మద్దిలపాలెంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

27న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 27న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

సబ్సిడీపై రెండు టన్నుల టమాటాల విక్రయాలు


సీతమ్మధార రైతుబజారులో టమాటా కోసం క్యూలో నిల్చున్న వినియోగదారులు

సీతంపేట: నరసింహనగర్ రైతుబజార్‌లో కిలో రూ.50 చొప్పున రెండు టన్నుల టమాటాలు సబ్సిడీపై విక్రయించారు. టమాటా ధర నియంతణకు ప్రభుత్వం సబ్సిడీపై రైతుబజార్లలో వీటిని విక్రయిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.120 నుంచి 130 వరకు విక్రయిస్తున్నారు. ధరల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా టమాటాలు కొనుగోలు చేసి సబ్సిడీపై ప్రజలకు అందిస్తోంది. మంగళవారం కూడా నగరంలోని అన్ని రైతుబజార్లలో సబ్సిడీ టమాటాలు విక్రయించారు. నరసింహనగర్ రైతుబజార్‌కు 80 క్రేట్లు (రెండువేల కిలోలు) టమాటా వచ్చినట్టు ఎస్టేట్ ఆఫీసర్ చినబాబు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేసి టమాటాలు విక్రయించారు. సబ్సిడీ టమాటాల కోసం వినియోగదారులు తెల్లవారుజాము నుంచే క్యూలు కట్టారు. క్యూలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఆధార్ లేదా రేషన్ కార్డుపై కిలో చొప్పున విక్రయించారు. ఉదయం 8.30 గంటలకే రెండు వేల కిలోల టమాటా విక్రయించేసారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల పట్ల వినియోగదారులు, ముఖ్యంగా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీతమ్మధార రైతుబజారులో..

సీతమ్మధార: సబ్సిడీ టమాటా కోసం సీతమ్మధార రైతుబజారులో వినియోగదారులు బారులు తీరారు. కిలో టమాటా రూ.50కు మంగళవారం విక్రయించారు. ఉదయం నుంచి వినియోగదారులు టమాటా కోసం క్యూ కట్టారు. ఆధార్, రేషన్ కార్డుకు కిలో టమాటా రూ.50కి విక్రయించారు. మొత్తం మంగళవారం 109 క్రేట్ల టమాటా విక్రయించినట్లు స్టేట్ అధికారి కొండబాబు తెలిపారు.

లలితా పీఠానికి పోటెత్తిన భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెంలో గల లలితాపీఠానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి వారి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. జూలై 3వ తేదీ నుంచి సెప్టెంబరు 29 వరకు చాతుర్మాస దీక్షలు జరగనుండటంతో స్వామీజీ లలితాపీఠంలో భక్తులకు అందుబాటులో ఉంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి స్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులను దర్బారు హాల్లో కూర్చోబెట్టి ఒకరి తర్వాత మరొకరిని దర్శనానికి అనుమతిస్తున్నారు. అలాగే పలువురు భక్తులు తమ సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు మంత్రోపదేశం తీసుకుంటున్నారు. పీఠం విస్తరణాధికారి మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. స్వామీజీని కలవడానికి ముందుగా అనుమతి తీసుకోవాలని తెలిపారు.


లలితా పీఠాధిపతిని దర్శించుకుంటున్న భక్తులు

అప్పన్నకు నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది.

‘మణిపూర్‌లో చిచ్చుకు బీజేపీయే కారణం’

సీతంపేట: మణిపూర్‌లో రెండు నెలలకు పైగా జరుగుతున్న హింసాకాండను అక్కడి బీజేపీ ప్రభుత్వమే నడిపిస్తుందని పలు రాజకీయ పార్టీల నేతలు ఆరోపించారు. సీపీఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక పౌరగ్రంథాలయంలో మణిపూర్ ఘటనపై జరిగిన చర్చా గోష్ఠిలో టీడీపీ, సీపీఎం, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, లోక్‌సత్తా, మహిళా సమాఖ్య నాయకులు పాల్గొన్నారు. సీపీఐ విశాఖజిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్నది మత హింస, కేవలం రెండు మతాల మధ్య జరుగుతున్న పోరాటం కాదని, భూమి, వనరుల వంటి ప్రధాన అంశాలు ఇమిడి ఉన్నాయన్నారు. ఇందులో మత మౌఢ్యులు, మిలిటెంట్లు పాల్గొంటున్నాయని ఆరోపించారు. అధికారంలో ఉన్న బీజేపీ ఫాసిస్టు ప్రభుత్వం తవ రహస్య కార్పొరేట్ అజెండా నెరవేరేలా తెలివిగా వ్యూహాలు రచించి అమలు చెయ్యడమే నేటి సంక్షోభానికి దారితీసిందని ఆవేదన వ్యక్తం చేసారు. ముఖ్యమంత్రి బీరెన్‌సింగ్ రాజీనామా చెయ్యాలని, సుప్రీంకోర్టు అజమాయిషీలో విచారణ జరిపించి బాధితులకు న్యాయం చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.జగన్ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

ఆటోలకు గ్యాస్ అందుబాటులోకి తేవాలి


బాబా ఆలయం స్టాండ్ వద్ద నినాదాలు చేస్తున్న ఆటో డ్రైవర్లు

సీతమ్మధార: విశాఖ జిల్లాలోని సీఎన్జీ ఆటోలకు గ్యాస్ అందుబాటులోకి తీసుకురావాలని, అన్ని ప్రాంతాల్లో బంకులు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ అన్నారు. మంగళవారం సీతమ్మధార షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద సీఎన్జీ ఆటో డ్రైవర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ ఆటోలపై ప్రైవేట్ ఫైనాన్షియర్ల దోపిడీని అరికట్టాలన్నారు. నగరంలో తిరుగుతున్న ఆటోలకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని, ఈ చలానాల విధింపు ఆపాలన్నారు. ఆటో డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఎన్జీ ఆటోస్టాండ్ ప్రెసిడెంట్ సారిపల్లి ప్రసాద్, ఎస్‌కే బాషా, శంకరరావు, రమణ, శ్రీనివాసరావు, శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ టెక్నాలజీపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

ఆరిలోవ: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యా విధానంలో అమలు చేస్తున్న డిజిటల్ టెక్నాలజీపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. తోటగరువు, వాడపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పరిధిలో ఉన్న 20 ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మంగళవారం స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్ పేరుతో అవగాహన సదస్సు నిర్వహించారు. తోటగరువు ఉన్నత పాఠశాలలో ఈ సదస్సు రెండు రోజుల పాటు జరగనుంది. తొలి రోజు సదస్సులో డీఈవో మాట్లాడుతూ ప్రస్తుతం బోధనా విధానంలో మార్పులు వచ్చాయన్నారు. విద్యార్థులకు ఆధునిక పద్ధతిలో బోధించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిలో భాగంగా డిజిటల్ విధానం, టోఫెల్‌పై అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. ఎంఈవో–2 పి.అనురాధ పర్యవేక్షణలో జరిగిన మొదటి రోజు సదస్సుకు 20 పాఠశాలలు నుంచి 45 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్, తోటగరువు హైస్కూల్ హెచ్ఎం జి.కె.డి.భవాని, కార్యదర్శి వి.విశ్వనాథం, సీఆర్‌పీ టి.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం..

మత్తు పదార్థాలతో జీవితం చిత్తు


విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస రావు

ఏయూ క్యాంపస్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం ఏయూ సైన్స్ కళాశాల పరిధిలో విద్యార్థులకు మత్తు మదార్థాల వినియోగం–పర్యవసానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలతో ఎదగాలన్నారు. విద్యార్థి జీవితం ఎంతో విలువైనదని, ఉన్నత భవిష్యత్తుకు మార్గంగా ఇది నిలుస్తుందన్నారు. ఏయూ జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ యువత దేశానికి విలువైన సంపదని చెప్పారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ కె.రామారావు మాట్లాడుతూ మత్తుకు బానిస అయితే జీవితం చిత్తవుతుందన్నారు. వివిధ చట్టాలపై, శిక్షలు, పర్యవసానాలను వివరించారు.

మానవ హక్కుల పరిరక్షణకు శాంతి ర్యాలీ

ఏయూ క్యాంపస్: ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణకు కృషి జరగాలని ఏయూ విద్యార్థులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఏయూ న్యాయ కళాశాల నుంచి మద్దిలపాలెం గేట్ వరకు ప్లకార్డులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. హక్కుల ఉల్లంఘనలు జరగకుండా చూడాలని నినదించారు. ఈ కార్యక్రమంలో ఏయూ న్యాయ విభాగం, రాజనీతిశాస్త్ర విభాగం, సామాజిక శాస్త్ర విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.



శాంతిర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

విద్యార్థుల రక్తదానం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు రక్తదానం చేశారు. జూలై 26న కార్గిల్ విజయ దివస్‌ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం ఏయూ డిస్పెన్సరీలో పలువురు విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని లైఫ్ షేర్ రక్తనిధి కేంద్రానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, డాక్టర్ ఎ.కె.ఎం.పవార్, డాక్టర్ కె.ఎస్.ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న రిజిస్ట్రార్

ఘనంగా భూలోకమాత మారువారం పండగ


భూలోకమాతకు అభిషేకాలు చేస్తున్న అర్చకులు


ఊరేగింపుగా వస్తున్న మహిళలు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న భూలోకమాత అమ్మవారి మారువారం పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఘటాలను శిరస్సు పెట్టుకుని ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం మహా అన్నదానం కార్యక్రమం చేపట్టారు.

సకల కళాకారుల సంఘం ఎన్నికలకు నామినేషన్లు

సీతంపేట: విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘానికి ఈ నెల 30వ తేదీన జరగనున్న ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం మంగళవారం స్థానిక పౌర గ్రంథాలయంలో జరిగింది. అధ్యక్ష స్థానానికి రచయిత్రులు డాక్టర్ జాలాది విజయ, చెక్కా రమాదేవి, ఉపాధ్య స్థానానికి ఎం. త్రినాథరావు, పీఏ భాస్కరరావు, కార్యదర్శి స్థానానికి కె.లోకేష్, సహాయ కార్యదర్శి స్థానానికి గెంబలి జగదీష్, కోశాధికారి స్థానానికి మదుపాడ రమణి, బూడిద లక్ష్మి స్వరూప నామినేషన్లు వేశారు. ఎన్నికల అధికారులుగా మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, గాయకులు జామి శివ అప్పలరాజు వ్యవహరించారు. ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్ చెన్నా తిరుమలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


అధ్యక్ష పదవికి నామినేషన్ అందజేస్తున్న రచయిత్రి జాలాది విజయ

సత్యదేవుని హుండీ ఆదాయం రూ. 6.98 లక్షలు

డాబాగార్డెన్స్ : నగరంలోని ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం చేపట్టారు. ఈ లెక్కింపులో రూ.6 లక్షల 98 వేల 185 ఆదాయం వచ్చింది. హుండీ లెక్కింపులో ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్, జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయ ఈవో సురేష్‌బాబా, వేంకటేశ్వర సేవా సంఘం నుంచి డి. నగేష్, అప్పారావు ఆధ్వర్యంలో పలువురు సేవకులు, దేవస్థానం ప్రధాన అర్చకుడు పి. నరసింహాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.